నా గాజుమేడ
(వాక్ చిత్రం)

ముప్పై ఏళ్ళ క్రితం సంకల్పించి ఇరవై యేళ్ళ క్రితం ప్రారంభించిన నా గాజుమేడ యీనాటికి పూర్తయింది. దాని నమూనా ప్రఖ్యాత పురుషులే తయారుచేశారు. గ్రీసు దేశపు శిల్పులు పొరిక్లోటిస్, ఫిడియస్, ఖాల్డియన్ యువరాజు "గుడియా", అసిరియా చక్రవర్తి అశ్రుబనిపాల్ సౌధంలో దారు చిత్రాల నిర్మాత ట్రాజన్, ఇంగ్లండులో గోడ కట్టిన రోమ్ రాజు హాడ్రియన్—వీరు నమూనా సిద్ధంచేశారు. తంజావూరు ఆలయ శిల్పులు, హరప్పా నిర్మాతలు దంతంలో సౌధ నిర్మాణం జరగాలని సూచించారు. దంతం రంగు కాలం గడచినకొద్దీ పోతుందన్నారు ఎల్లోరా శిల్పులు. సౌధ నిర్మాణానికి కావలసినంత దంతం అసలు ప్రపంచంలో దొరకదన్నారు అమరావతీ స్థూప నిర్మాతలు. ఏనుగుల్ని చంపితే ముందు ముందు ధనికుల వేట, క్రీడా వినోదాలకి ఏనుగులు లేక వారంతా తిరుగుబాటుచేసి యీ దంతపు భవనాన్ని నిర్మూలం చేస్తారు గావున ఆ యత్నం చెయ్యొద్దని "మకియవెల్లి" సలహాపైన అది విరమించాను.

మంచిగంధపు మేడ కట్టమని మొహెంజదరో మేస్త్రీలు సూచించారు. నైలురాణి క్లియొపత్రా వల్లకాదంది. పాములొస్తాయట. పాములంటే అసహ్యంతో మిళితమైన మమకారం ఆమెకి. "ఆ పాముని ముద్దిడుకుని మరణిస్తే ఎంత బాగుంటుందో" అనుకునే ఆ సుందరాంగన మాట కాదనలేకపొయ్యాను. అద్దమే మంచిదని పెద్దలు నిర్ణయించారు. సరే, అల్లాగే అద్దాలమేడ కట్టమన్నాను. భూమి త్రవ్వారు—ఐరోపా దేశాలలో దొరికినంత గాజును పోగుచేశారు. పునాది అవసరం లేదన్నారు, గాలిలో తేలియాడే మేడ గనక. ఎందుకేనా మంచిదని, కాస్తంత పునాదులు

ఉంచుదామన్నారు మహాశిల్పులు "గియోటో", "సినోరెల్లిలు". పక్క గోడలు జర్మన్ శిల్పి "గ్రోపియస్" పని; ద్వారబంధాలు, "డొనటెల్లో" పూర్తిచేశాడు. కప్పులు "లినార్డోడవిన్సి", "మైకెల్ ఎంజిలో"— ప్రముఖ శిల్పుల తయారి. మధ్య పెద్ద హాలు. హాలు నగిషీలకి జపానీయ కళాకారుడు "ఉటమారో"ని రప్పించాను. పై అంతస్థులు ఆంగ్ల శిల్పులు "ఇనిగో జోన్స్", "క్రిస్టఫర్ రెన్" ఢిల్లీలో వైస్‌రాయ్ భవనం కట్టిన "ఎడ్విన్‌లుట్‌యెన్స్"ల సలహాపైననే తయారైనవి. మెట్ల వరుసలన్నీ "సెల్లినీ" ప్రతిభను చాటుతాయి. భరతముని సూచనల ననుసరించి ఒక నాట్యశాల తయారుచేశారు. దాన్నిండా కుడ్య చిత్రాలు, ఫ్రెస్కోలు, ఫ్రీజ్‌లు, రామప్ప ఆలయం నిర్మాతల నాయకుడైన శిల్పి చంద్రభూషణ్ చెక్కిపెట్టాడు. అందులోనే మైకెల్ ఎంజిలో ప్రత్యేక శ్రద్ధతో చెక్కిన వీనస్ డిమెలో శిల్పం, "నాగిని" నగ్న సౌందర్యం అమర్చబడ్డాయి. ముంతాజ్ సతి ప్రతిమ నల్లరాతిలో ముసుగువేసుకుని, యమున నదీతీరాన్ని భేదిస్తున్నట్లుగా కూర్చి, దానికింద "కలలుకనేవారికి కన్నీటికేమి కొదవ" అని సువర్ణాక్షరాలలో వ్రాశారు. ఈ ప్రతిమలమధ్య ఏకాంతం కుదరదని మొరెట్టుకున్నాను. ఇవేమీ లేకుండా ఏకాంతంగా ఆలోచించేటందుకు వినోదించేటందుకు నాకు పైన ఒక బురుజులాంటిది కావాలన్నాను. "ఏకాంతంగా వినోదించడం యీ సృష్టిలో సాధ్యంకాదనీ, వినోదానికి మరొకరు కావాలనీ, అసలు నా గాజుమేడ నిర్మాణంతో ఆంతర్యం ఏమిటో తెలవియ్యమనీ పేచీలువెయ్యసాగాడు "సోక్రటిస్."

నాకి ప్రపంచం గందరగోళంగా ఉంది. "జాడ్యం, కుళ్ళు, యుద్ధాలు, వార్ధక్యం, మృత్యువు—వీటినుండి తప్పించుకు పారిపోయి దూరంగా వొంటిగా ప్రశాంతంగా గడపాలని వుంది" అన్నాను.

"మనుషుల్లో ఉండలేని మానవుడు" అని ఆక్షేపించాడు "రూసో." దూరంగా పోయి, సమాధిలోపడి, దీక్షతో తపస్సు చేస్తేగాని మానవుడు

ఉత్తమ లక్ష్యాలను సాధించలేడు. క్రీస్తు, మహమ్మదు, శంకర, త్యాగరాజు, బుద్ధుడు—అందరూ ఈ విధంగా వెళ్ళిపోయి ఆత్మబలం సమకూర్చుకుని ముక్తిని సాధించినవారే-నాకూ అల్లా అవాలని తోచ డంలో తప్పేమిటి ?

బుద్ధుడు మృత్యువుని జయించగలిగాడా ? జాడ్యాన్ని మాప గలిగాడా ? వార్ధక్యాన్ని వారించగలిగాడా ?" అని హేళనగా ప్రశ్నిం చాడు "కాన్‌ఫ్యూషియస్." అతనికి వ్యవధి చాలలేదు. శిష్యులు కొందరు చుట్టూ జేరి అప్పుడే సాధించేశావులే అంటే నమ్మేసి బోధనా పద్ధతులు, సిద్ధాంతీకరణ, ఉద్యమ వ్యవస్థాపన మొదలైన వాటిల్లోపడి, అసలు కోరినదాన్ని వొదిలేశాడు-అంటూ సమర్థించాడు బెర్నార్డుషా. నాబోటి గాళ్ళు మరో కోటిమంది దీక్షగా పట్టుదలతో వేటిని కాంక్షిస్తే అవి సిద్ధి స్తాయి—అని షా, డార్విన్, "బెర్గ్‌సన్లు" ధైర్యం చెప్పి ఉత్సాహ పరుస్తూ వెన్ను మీద చరిచారు.

ఇంతకీ యింత పెద్ద పెద్ద ఆలోచనలు నాలో తీవ్రంగా తిరగాడ్డం లేదు. సామాన్య ప్రజలందరికీ లభ్యమైపోతున్న విషయాలపై నాకు నమ్మకం, మమకారం తగ్గిపోతున్నాయి. అందరికీ చదువు, విజ్ఞానం లభ్యమైతే వాటిని సంపాదించుకోవాలన్న కాంక్ష క్షీణిస్తోంది. ఉత్తమకళ ప్రతివారూ ఆస్వాదిస్తున్నారనగానే నాకు ఆ కళ చవకదిగా కనబడు తోంది. అందరూ మెచ్చుకున్నది మెచ్చుకోలేను; అందరూ ఆనం దించేది నే ఆనందించలేను. నా అనుభవం, ఆనందం అపూర్వంగా, ఎవ్వరికీ లభ్యం అవనివిగా, నా స్వంతవిగా ఉండాలి. అందుకే ఈ గోలంతా.

ఈ జనం అంతా స్వర్గంలోకి పోతారంటే నాకు స్వర్గానికి పోవా లనే లేదు. "ఈ ఆలోచనలు నరకానికి నెట్టుతాయిలే" అన్నాడు డాంటె. అక్కడికే పోతాను.

పూర్వం మాటలుటండీ, ఒక్కొక్కడు వొక్కొక్క గ్రంథం వ్రాశాడంటే అది మతమై కూర్చునేది. దానిలో రహస్యం విశదీకరించేందుకు వందలాదిగా వ్యాఖ్యాతలు, శిష్యులు బయలుదేరినాయి. మరిప్పుడో—సులువుగా వ్యవహార భాషలో సామాన్య మానవుడికి అర్థమయ్యేలా వ్రాయాలి. నాట్యం అందరికీ రుచించాలి. చిత్రలేఖనం నిత్యజీవనంలో వుపకరించాలి. ఏ కళాఖండం ఇరవై నయాపైసే మించరాదు. అనుభవించేటందుకు జీవితానుభవం, సంస్కారం, పాండిత్యం, ఊహ, కృషి ఏవీ అక్కరలేదు. అందుకనే యిక్కడ వుండలేను. దూరంగా ఏకాంతంగా ఉత్తమ కళని, గొప్ప సౌందర్యాన్ని, ఆత్మసాక్షాత్కారాన్ని, సాధించి వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతని బుజువుచేసుకొని ఆధ్యాత్మికానుభూతిని పొందుతాను. అందుకే యీ గాజుమేడ.

"హోమర్", "గెథె", "టాల్‌స్టాయి"లు బాగుంది, కానీ మన్నారు. షేక్స్పియరు, వేమన్నలు పెదవి విరిచి, అసమ్మతిని తెలియచేస్తూ తల పంకించారు.

ఏకాంత బురుజు నిర్మాణం పూర్తిచేసిన అద్భుత శిల్పులు — "కర్రిజియో", "టియిపొలో", "రూబెన్స్", "బెర్నిని"లు. "ఎరిక్‌గిక్" గారు డైనింగు హాలు సిద్ధం చేశారు. పోర్టికో, బాల్కనీ "ఆరిస్టిడి మాలియెల్" తయారు చేశారు. ఈ "మాలియెల్" స్త్రీ నగ్న ప్రతిమ చెక్కడంలో నిపుణుడు. నాలో నేను నవ్వుకున్నాను. నాకీ శిల్పాలెందుకు? రక్తమాంసాలతో సజీవులైన నగ్న స్త్రీలే వుంటున్నప్పుడు—కళాజగత్తులో మిథ్య ప్రతిమలతో నిమిత్తమేమిటి? అతని వుత్సాహాన్ని అరికట్టడం యిష్టంలేక ఊరుకున్నాను. ఇంక పడకగది. ఇది కేవలం "రోడిన్" చెయ్యాల్సిందే. అజంతా, ఎల్లోరా నిర్మాతలు యీ పనికి ఎగబడ్డారు — వారిని పంపించి వేసేటందుకు నా తాతలు దిగిరావాల్సి వచ్చింది. వాళ్ళు గొప్ప పనివాళ్ళే కాదనను. చిన్నవి, నాజూకువి

వారివల్ల కాదు. అంతా భారీగా పెద్ద ఎత్తున సాగాలి. పైగా మతంలో పడిపోతారు. నా మతం మానవత్వం. "రోడిన్" దీనికి తగినవాడు. మానవత్వంలోని హృదయాన్నే కాకుండా, అస్థిపంజరాన్ని సహితం ఎత్తి చూపగల ప్రతిభాశాలి. అద్భుతమైన గది. మరి మంచం ఎక్కడ ?

నవ్వాడు రోడిన్. "మంచం వుండకూడదు. గది అందం చెడుతుంది. పైగా నువ్వు నిద్రపోదల్చుకోలేదుగా. ఆనందం, అనుభూతి, ఏకాంతంలో ప్రశాంతత అవి కావాలిగా — నిద్రపోతే అవి దొరకవు." "అవుతే మాత్రం. అది కేవలం ఒక ఆదర్శం. దాన్ని సాధించడానికి, సాధ్యపడినంతవరకూ ప్రయత్నిస్తాను. అంతేకాని నిద్రాహారాలు మానుకోమనా! నిద్రాహారాలు మానవత్వానికి సూదంటురాయి — పునాది. మంచానికి కోళ్ళు" అన్నాను.

మరో ఏడాదికి సిద్ధం చేశాడు.

"ఏది మంచం?"

"ఇదిగో"

నాలుగు కోళ్ళు మాత్రం వున్నాయి. నాలుగు తలలు లేని స్త్రీ మూర్తులు. ఒకామెకి పిరుదులు లేవు; మరొకామెకి స్తనాలు లేవు. మూడో ఆమెకి చేతులు లేవు; నాలుగో ఆమెకి పాదాలు లేవు.

"మానవత్వం అనే మంచానికి కోళ్ళు" అని నవ్వుకుంటూ పొయ్యాడు "రోడిన్".

పిచ్చివాడు. "లినార్డోడావిన్సి"ని అడిగాను ఇదంతా ఏమిటని.

"ఆ మాత్రం తెలీదా. మానవుడు పరిపూర్ణ సౌందర్యాన్ని భరించలేడు. కొంచెంలో పోయిన అందం పాపాలకి తావున్న మంచితనం, అమరత్వం ఆశించే అల్పాయువు—యివే మానవత్వం ప్రకటిస్తాయి. పరిపూర్ణ సౌందర్యం, మంచితనం దైవానికి సాధ్యం. ఏ ఆలయంలో నయినా సరే, అన్ని అవయవాలు సరిగ్గావున్న ప్రతిమను చూశావా

నాయనా ? మైలో వీనస్ చేతులేవి ? కుజరాహోలో పాలిస్తున్న ప్రేయుం రాచన్మోన ఏమైంది ? అజంతాలో నల్లరాణి కాలొంకర తియ్యరేమి ? వుంచరు, నాయనా! వుంచరు. మానవుడే వాటిని ధ్వంసం చేస్తాడు. పరిపూర్ణ సౌందర్యం భరించలేడు.” ఇదంతా చరిత్రకారుడు గిబ్బన్‌కినచ్చినట్లులేదు. అతని వుద్దేశంలో మానవత్వం సంపూర్ణంగా వికసించినపుడు గొప్ప నాగరికత బైలుదేరుతుంది. సహజమైన కోర్కెలు తీర్చుకునే అవకాశం వుండి, మానవుడి అవయవాలు, సర్వేంద్రియాలు వికసించి, వాటికి సరైన సృష్టిశక్తులు ప్రకటితమయ్యే అవకాశం వున్నప్పుడు, వున్నతమైన నాగరికత ఆదర్శ శిఖరాన్ని అందుకుంటుంది. రోము నాగరికత ఆ విధంగా విజృంభించింది. తరువాత క్రైస్తవ మతం వ్యాపించి, సహజమైన వాంఛలను అరికట్టే నైతిక విలువలు ప్రచారమైనప్పుడు, మానవుడు సృష్టిశక్తులు గోల్పోయి, తన శరీర అవయవాలకి పూర్తిపని కల్పించక, పరలోక చింతనలోపడి యీ లోకాన్ని విడిచిపెట్టినప్పుడు, నాగరికత పతనం జరుగుతుంది. రోము నాగరికత ఆ విధంగా పతనం చెందింది” అంటాడు చరిత్రకారుడు గిబ్బన్.

“విజృంభించి శిఖరాన్ని అందుకున్న ప్రతి నాగరికత పతనం చెంది తీరుతుంది—మానవుడు పుట్టడం, పెరగడం, వృద్ధి చెందడం, కృశించి, నీరసించి, క్రుంగి, వార్ధక్యంలో మృతి చెందడంలో సృష్టిలయ వ్యక్తమైనట్లు, నాగరికతలు పతనం చెందడం చరిత్రలో లయ—అందుకోసం విచారించనక్కరలేదు” అంటాడు మరో చరిత్రకారుడు “స్పెంగ్లర్”

కాబట్టి స్వేచ్ఛగా ఇంద్రియాలకు పని కల్పించి, సుఖించి ఆనందించినప్పుడే మానవుడి జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుంది. కావున ప్రవక్తలు ప్రతిపాదించిన మతానికి లొంగిపోవద్దని “వోల్టేరు”, “వాల్ట్ విట్‌మన్”, “సోలమన్” చక్రవర్తి, సముద్రగుప్తుడు, నా ఊహలని, సంకల్పాన్ని ఆమోదించి హుషారిచ్చారు.

ఇనుము, గాజుతో గాజు భవనం నిర్మించిన "పాక్స్టన్" దొర గారు మేస్త్రీగా ఉంటానన్నాడు. ఖండాంతరాల నుండి గాజు తెచ్చారు. పనివాండ్రమాటేమిటి ?

"నువ్వు మా వారసుడవు—మా గడింపు, సంపాదనా, అంతా నీవే. మేం సమకూరుస్తాం పనివాండ్రని" అని పెద్దలు ముందుకొచ్చి పని వాండ్రని రప్పించారు. వేలు, లక్షలు, కోట్లు—సూర్యుణ్ణి వెన్ను మీద కట్టేసుకుని, గాజులా మెరిసే ఇనుప కండరాలతో, అస్తిపంజరం కదలికతో భూమాతని అదరగొట్టె భుజబలంతో, "హమ్మురాబి", హానిబాల్, "నెబుకాడ్ నాజర్" "షార్లి మేన్", "దిప్ ఇలాహి", ఈజిప్టురాజు "హైక్ సోస్", "అక్బర్", "అశోకుడు", "తైమూరు", "ఛంగీస్ ఖానుడు", సుమేరు ప్రభు "ఊర్ ఎంగర్"—ఎందరెందరో మహారాజులు తమ ఆధ్వర్యంలో నాగరికతలు నిర్మించిన పనివాండ్రని రప్పించారు. లెక్కలు, చిట్టాలు, కొలతలు, ప్రణాళికా నిర్వహణ, "తైకర్ గస్" "రోబ్స్పియర్" "కౌటిల్యుడు" చూస్తున్నారు. వారి కష్టసుఖాలు కనుక్కుంటూ "శ్రీనాథుడు" "మార్కస్ ఆరిలియస్" శ్రమ పడుతున్నారు. తాపీ పనివాడు "చెంగీస్" చెప్పుచేతుల్లో పిరమిడ్లు లేవనెత్తిన శ్రామికులు వారంతా—చైనా గోడ లేవనెత్తినవారు ఆమూల; బాబిలన్ ఆకాశంలోకి లేవనెత్తినవారదుగో!

చురుకుగా, వేగంగా పనిచెయ్యమని, "సావనరోలా", "నానాఫర్న పీసు", "సెనెకా" వుద్బోధిస్తున్నారు. అటునుంచి యిటు, యిటు బాగు లేదు, యిటు నుంచి అటు సామాగ్రిని ఫిరాయించి, ఒక్కొక్కపని రెండేసిమార్లు చేయిస్తున్నాడు "మహమ్మద్ బిన్ తుగ్లక్." బద్ధకించిన వాడిని చావతంతున్నాడు బొబ్బిలి పాపారాయుడు.

పనివాండ్ర చెమటలు కారి నదులైనాయి. ఆ నదిలో క్లియోపాత్ర గాజు పడవలో షికారుకి రమ్మంటుంది. చెమట వాసన, వాడిన రోజా

పుష్పం కాక మరేమిటని ఓమర్ ఖయ్యామ్ కులాసా పాటలు. 'హాండల్', 'బెతోవెన్', మోజార్టులు' తమ గానంతో వారి శ్రమ తొలగిస్తామంటారు. ఈజిప్టు రాజు "ఇక్ నాటిన్" భార్య, మహా సౌందర్యవతి, ఆరుగురు బిడ్డల తల్లి "నెఫెర్ టిటి" వారి కాలక్షేపానికి నాట్యం చేస్తానంటుంది

"నెఫెర్ టిటి" సౌందర్యం, రక్తమాంసంతో కూడిన కండకావ్యం. రెండు మేఘాల మధ్య నుండి పొడుచుకొచ్చిన సూర్యకిరణంలా బుగ్గల నుండి దూసుకొచ్చిన ముక్కు; పర్వత శిఖరం వెనక దిగి సగమైన సూర్యబింబం లాంటి ఆమె నోరు — నిజమే - కాని ఆరుగురు పిల్లలతల్లి నాట్యం చెయ్యడమా! పిల్లకొకటి చొప్పున పొట్ట కింద ఆ మడతలు లయకి లొంగుతాయా? రంగాజమ్మ నాట్యానికి వొప్పుగున్నాను ఆఖరుకి. ఆలయంలో స్త్రీ శిల్పాల స్తనాల నిండుతనం, బలం, వొంపుల వొయ్యారము, చూపుని ఆ రెంటి మధ్య బంధించి వేసేటందుకు మాత్రం మిగిలిన సందు - చూపు యింకెటూ ప్రసరించినా, గొలుసుతో కట్టేసిన చిరుత పులికి మల్లే మళ్ళా వాటి మధ్యకే రావాలి మరి!

ఆ కూలీలు, ఆ మేస్త్రీలు అల్లా వారాలు, నెలలు పనిచేస్తున్నారు. వర్షానికి తడిసేబట్టలు లేవు; ఎండిన చర్మం తడవదు. ఆ ఎండని, ఆ వానని, ఆ తడిని, ఆ వేడిని ఆ ఎముకల్ని శిథిలాలుగా జీవంతో చరిత్రలో కదులుతున్నట్లు వారి రక్తంగాజై, వారి వాసన వాతావరణమై, వారు విడిచేసిన శక్తి రేడియమ్‌గా, న్యూట్రాన్, పాజిట్రాన్, సైక్లోట్రాన్, ఎలక్ట్రోన్‌ల క్రియ— ప్రతిక్రియల గొలుసుగా, భాషలేని వారి ఆకలి ఆలోచనలు అతుకులుగా, చావడానికి ఓపికలేనంతగా శ్రమించిన వారి ప్రాణాలు నగిషీలుగా, యుగయుగాల జిజ్ఞాసపరిణితి అంతస్థులుగా నా గాజుమేడ లేచింది — ఈనాటికి పూర్తయింది.

వారేమీ ప్రతిఫలం కోరలేదు. 'ఇది మా ఆస్తి - మా శక్తి - వారసుసుగా నీకు ధారపోస్తున్నాం. స్వీకరించు. తీరిక వున్నప్పుడు ఎప్పుడేనా

మమ్మల్ని స్మరించు; అంతేచాలు' అన్నాడు వాళ్ళందరి తరఫునా నాగార్జునాచార్యుడు.

వారినిచూస్తే జాలేసింది. వారికాలంలో వారు మహా పురుషులు - కానీ నా ముందు వారెంత? వారి అజ్ఞానం, సంకుచిత దృక్పథం, పరిమితమైన చైతన్యం - నాకెంతో అల్పంగా కనిపించాయి. వారు వారి వారి యుగాల ప్రతినిధులే కావొచ్చు; వారి వారి యుగాల విజ్ఞానం, ప్రతిభ వారిలో కేంద్రీకరించి వుండొచ్చు. కాని, వారు ఆ యుగాలలో బంధితులైనారు. అది దాటి ముందుకు చూడలేరు. నాకు తెలుసున్న వెయ్యో వంతు వారికి తెలుసా? చరిత్ర చీకటి గుహలు నాతో వెలుగు చూశాయి. బూడిదై యింకా నవ్వుతున్నారా నన్ను చూసి! అవును, నేను బూడిద నవుతాననేగా? అవుతేనేం? నా జీవితం నిండైనది, నా చైతన్యం, జిజ్ఞాస, వికాసం, వెలుగు, సృష్టి విజృంభణ, ఆత్మసాక్షాత్కారము నాలో దైవం కాసేపు యథార్థమయ్యే పరిపక్వత వారికేది? వారి పళ్ళ మధ్య కాలం మట్టి కొట్టింది - నామాటో? గాజుముక్కలు.

నా గాజుమేడ ఎంతో పెద్దది. ఈఫిల్ బురుజుకంటె వెయ్యిరెట్లు ఎత్తైంది; ఎవరెస్టు శిఖరం కంటె వందరెట్లు పెద్దది—

"ఎక్కడ పెట్టం?"

"పైకి దూరంగా ఎతుగా యీ లోకానికి అందకుండా చాలా దూరముగా" అన్నాను. పైకి పెట్టేశారు.

కింద భూమి అంచు గుండ్రంగా కనిపిస్తోంది - ఆకు పచ్చగా, గోధుమరంగుతో చిన్న చిన్న గుట్టలు—మళ్ళా చదునైన నేలా. అక్కడక్కడ కొండపల్లి బొమ్మలల్లే గుడిసెలు, భవనాలు. చెట్లచాటున, గుట్టల నీడలో భయపడి దగ్గరకి జరిగినట్లుగా చూస్తూ పొగలో మసగగా ఆకృతి కోసం పెనుగులాడుతున్న గ్రామాలు, గ్రామాలలో రొద చీమల బృందగానంగా వినబడుతోంది. మేఘాల మధ్య నుండి అక్కడక్కడ కొండజాతి కన్య రొమ్ములకి మల్లె పర్వత శిఖరాలు; కొండజాతి కన్య చింపిరి

జుట్టలై అడవి పరంపర. మిగతా అంతా సముద్రం—పచ్చగా, తెల్లగా కరిగిన ఇటుకల మాదిరి వొడ్డుకేసి కదులుతున్న సముద్రం.

ఆ కెరటాల కేసి చూశాను ఎప్పటి నుంచో వున్న సముద్రం—చరిత్రకందని వయస్సు. అనంత జీవి. చీర విడిచేసినట్లు కింద లోతుగా భూమి. మళ్ళా చీర వెతుక్కుంటున్నట్లుగా, వొడ్డుకేసి సిగ్గుపడుతూ పరుగులు! వాటికెంత మమకారం! ఆ పెద్ద కెరటం తండ్రి - నెరిసిన గడ్డం తెల్ల తుంపరలు—మెల్లగా ముసుగుతీసి చూస్తున్నాడు సంతానాన్ని. అవి పిల్లలు; ఆ వంకర కెరటం, పడుచుదనంలో విర్రవీగి, ప్రేమలో విషాదం తెలియకుండా భ్రమించి మిడిసిపడుతూ వొడ్డున శృంగారంకోసం విరగబడుతోంది. వాడు ఆ పోకిరీ కుర్రాడు బంతనుకొని రాళ్ళని తన్ని "అమ్మో కాలు విరిగిం"దని వెక్కిరిస్తాడు. ఏంయిలెస్సులా అక్కయ్య లోపలికి లాక్కుపోయింది. స్త్రీలు, పురుషులు ఈ చోద్యం చూడాలని వొడ్డునపడి చెరిపేస్తున్నారు - వొంటిగా వొస్తారు. వొంటిగా వెడతారు—ఈ మధ్యలో సముద్రమంతటి ప్రేమ వాటికి పాపం! ఆ వృద్ధ తండ్రి "భద్రం" "భద్రం" అంటూనే వున్నాడు. ఎవ్వరూ వినిపించుకోరు—వ్యక్తిత్వాన్ని అలవరచుకున్న జీవిత పరిశోధకులు చస్తారు. అంతే పర్యవసానం. ఒకరిద్దరు వొడ్డున వొళ్ళు కాలి "బాబో" అనీ నాన్నని పెదుక్కుంటూ లోపలికిపోతారు. కాని నాన్న లేడు. వృద్ధుడు ఆ మూల రాళ్ళ గుట్టకింద ఇసిగతెన్ను చూసి, భగవంతుడని భ్రమించి, భక్తితో తల పగలకొట్టుకొని హతుడయ్యాడు. తండ్రిలేని ఆ కెరటాలు అమ్మకోసం లోపలికెళ్ళి ఆమెలో కలిసిపోయ్యారు. అమ్మా నాన్న ఐక్యమైనదే సముద్రంహృదయం, రహస్యం; అమ్మో! దానిలో ఎన్నో దాపరికాలు; కుట్రలు, కుళ్ళు, దగాలు, అపచారాలు, పాపాలు, పాటుపోటులు పశ్చాత్తాపం, చందమామ రాత్రి, పగలు సూర్యుడు తీర్పు, అఘాతంలో దుండగాలకి ఒళ్ళుమండి తుఫాను లేపి దాన్ని కడిగి పవిత్రంచేస్తూంటారు. ఆమె నిట్టూర్పుకి నోచుకోరండి. ఏ మూలుగు బాధనుకోకండి. అంతా దగా.

పైకి నాటకం. చాసిపొట్టలో దాగిన ఏపుత్యపుచిప్పకు తెలుసు యీ వేషం; పొంపుతిరిగి చిప్పలో దాక్కుని ముత్యం మవుతుంది — తపస్సుచేసే ఋషికిమల్లె. ఈ సముద్రం, ఈ లోకం దగా అని, మాయ అని ఇద్దరికీ తెలుసు. ఈ సంగతి మనుషుల కెల్లా తెలుసు? యోగిని పట్టుగుని లేపి ఏమిటని అడుగుతాడు; ముత్యాన్ని వేటాడి ప్రేయసిమెడలో వుంచి మురిసి పోతాడు. సముద్రంలో చాంచల్యం ఆ ముత్యంలో మిగిలివుంది — అది ఆమెని ఆవరిస్తుంది. ఆమె అతన్ని విడిచి మరొకరితోపోతుంది.

ఎంతసేపని చూడను సముద్రం కేసి! విసుగెత్తింది. లోపలి హాల్లో కెళ్ళాను. అన్నింటిలో నేనే—ఎన్నో నేనులు — కోణాని కో చదరపు నేను. వంకరమలుపు కో గుండ్రని నేను— పొడుగ్గా నుదురు సాగేసినట్లు; పొట్టిగా గడ్డల నొక్కేసినట్లు - ఆ రంగులమధ్య, ఆ వెలుగులనడుంగా — వికృతమైన వొస్తువు నేను ఒక్కణ్ణే. బైట నిలబడి ఆనందించనా? అసలు బైటనేదిలేదు; వొక్కొక్క సూర్యకిరణం గోడలమీదపడి విరిగి ఏడు రంగులుగా ముక్కలై నా కంటిపాపల్ని కాల్చివేస్తున్నాయి. చందమామలో రంగువంకరలు, వంకర రంగులూను.

రామాయణంలో వెన్నెల వర్ణన చదువుతానంది మొల్ల. ఆమె నల్లటి మొహం ఏడురంగులతో కలతచెందింది. భయంలో కప్పుకున్న చీరమడతలు జారి విడిపడ్డాయి. మొల్లవి పెద్ద నిండైన స్తనాలు. ఆ అద్దాలమధ్య అవి అతిశయోక్తిగా శిథిలాలయాల మాదిరి దగ్గరగా వెళ్ళి చంద్రగోళాన్ని చూసినట్లు వికృతంగా మరీ పెద్దవిగా నాలుగు, పదహారు — అబ్బ, వేలు, కోట్లు — అంతా అవే. నాకు వూపిరాడదు. నేను మారంగా బురుజులోకి వెళ్ళిపోయ్యాను. రంగాజమ్మ నృత్యం చెయ్యడానికి సిద్ధం నగ్నంగా వున్నప్పుడు, చోటుచేసుకుని ఆమె రొమ్ములమధ్య నా మొహం దాచుకోవా లని వుండేది — వాటల్లో అంత పారవశ్యత, ఓదార్పు, అభయం వున్నాయి. కాని మొల్ల వుదంతం చూసింతర్వాత నేను వివస్త్ర అయిన స్త్రీని భరించ లేను. చీరలు, ఒకదానిపైన ఒకటి పొందక చీరలు కట్టుకుని మరీ నాట్యం

చెయ్యమన్నాను. "పుట్టబొమ్మనా?" అన్నదామె ఆక్షేపణగా. ముత్తుస్వామి దీక్షితులు తంబూర తీసుకొచ్చాడు. మాస్కో-నుండి తిరోగమించినపుడు మిగిలిన సైనికులతో డ్రిల్లుచేయిస్తానంటాడు నెపోలియన్. "బెర్లియోజ్" ఆర్కెస్ట్రా వినిపిస్తానంటాడు. నా బొమ్మ గణిత శాస్త్రంలో చిహ్నలుగా విభజించి గీస్తానంటాడు "పాల్ సెజాన్". ఆదిభొట్ల నారాయణ హరికథ చెబుతాడట. తాన్సేన్ గానం చేస్తానంటాడు. తెనాలి రామకృష్ణుడు భోగందాని భోగట్టా వినమంటాడు. "ఎర్రాప్రగడ", "ముద్దుపళని," 'లారోషిఫోకల్ట్' "బాస్వెల్,"చిలకమర్తి," 'లారెన్సు' 'ఆరిస్టాటిల్' తమ రచనలు చదువుతామంటారు.

సోక్రటీస్ ఒక ప్రశ్న వేశాడు.

"ఇవి చూసేటందుకు, వినేటందుకు, ఆనందించేటందుకు జనం ఏరి? ప్రేక్షకులేరి?"

నాకోసమేగా, నేనే ప్రేక్షకుణ్ణి.

ఆస్వాదించే రసికులున్నప్పుడే కళాకారుడి విజృంభణ. ఒక్కడే వుంటే అతని కేం వుత్సాహం వుంటుంది?

"పోనీ మీరంతా వున్నారుగా" అన్నాను.

"వారందరూ కళాకారులే—వారిలో వారికి పడదు నీకు తెలుసుగా. ఒకర్ని చూసి ఒకరు ఓర్వలేరు. ఒకరువేదికపై నున్నప్పుడు ఇతరకళాకారులెవ్వరూ వుండరు" అన్నాడు సోక్రటీస్.

"పర్యవసానం?"

"భూమిదగ్గరగా చేరి, అక్కడివారిని రప్పించడమే" అన్నాడు.

అతని తెలివికి మెచ్చి, నా మేడనుగురించి ప్రేక్షకజనం వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ఇన్ఫర్మేషన్ ఆఫీసరుగా సోక్రటీస్‌ని నియమించాను.

కిందకి దించే ఏర్పాట్లు చెయ్యమన్నాను.

ఆ వింతగా నవ్వినవ్యక్తి "ఆల్బర్టు ఐన్‌స్టీన్"

"అది సాధ్యపడదు భూమినే మనదగ్గరికి రప్పించాలి" అన్నాడు.

"అదేమిటి?"

"ఆ మాత్రం తెలీదా? భూమికి ఆకర్షణశక్తి వుంది. దాన్ని అతిక్ర మించి మరోగోళం ఆకర్షణశక్తి అణువులను ఆకర్షించే అణుపదార్థాన్ని గాజులో వెయ్యించమని పాక్స్టటన్‌కి సలహాయిచ్చాను. లేకపోతే నీ గాజు మేడ కిందకి పడి కూలిపోను" అన్నాడు.

"అవులే భూగోళం మనదగ్గరకొస్తుందా?"

'గాజులో అణుపదార్థం సాంద్రత తగ్గించాలి' అన్నాను ఐన్‌స్టీన్.

"మరి కానివ్వండి. ఎంతకాలం పడుతుంది?"

'ఏ గడియారంచొప్పున ఎంతకాలం?' అని ప్రశ్నించాడు.

"అంటే?"

ఈ మాత్రం తెలీదా? కాంతి సెకనుకు లక్ష ఎనభై ఆరువేలమైళ్ళు వేగంతో ప్రయాణం చేస్తుంది. దూరంగా కనబడే ఆ గోళంకేసి చూడు, అక్కడనుండి వెలుగురావడానికి ఆ వేగం చొప్పున మూడువేల సంవత్స రాలు పడుతుంది – మీ భూగోళం కాలమానం ప్రకారం నువ్వు ఆ గోళం నుండి చూస్తే ఈ సోక్రటిస్ విషంతాగేఘట్టం చూస్తావు. ప్లాటో, గౌతమీ పుత్ర శతకర్ణి, చోళరాజు, లంకేశ్వరుని చెల్లెలు శూర్పణఖ నీదగ్గరకి ఒచ్చారనుకుంటున్నావు. వాళ్ళు రాలేదు. నువ్వే వాళ్ళదగ్గరకి కాలం – స్థలం ఏకమైన నాలుగో పరిమాణంలో ఒచ్చావు.

ఆ గోళం నుండి చూస్తే సీజర్ హత్య కనబడుతుంది. ఇక్కడ నుండి విజయనగర సామ్రాజ్య పతనం కనబడుతుంది. కాలానికి ముందు వెనుక లేవు. అది స్థలంలో బంధించబడి వుంది. ఆ స్థలం భూగోళా నికి సంబంధించింది. అవుతే ఒక దృశ్యం చూస్తావు. మరో గోళం నుంచి మరో దృశ్యం చూస్తావు. ఘట్టాలకి మొదలు అంతం లేవు. అవి వుంటూ వుంటాయి. విలకించేవాడు ఎప్పుడు ఎక్కడ వున్నాడో—దాని మీద ఆధారపడుతుంది ఆ వుంటి వుండడం" అనేది.

"ఎంత ఉపన్యాసం దంచావయ్యా, మేడని కాస్త కిందకు దించ మంటే" అన్నాను.

దించారు.

"ఎక్కడ దించం" అని అడిగారు.

"ఎక్కడ ఖాళీవుంటే అక్కడ" అన్నాను.

"ఎక్కడా ఖాళీలేదు" అన్నాడు లెనిన్.

కిందికి చూశాను. ఎక్కడా విశాలమైన బైళ్లు లేవు. అన్నీ నగరాలు, నదులు, ఒంతెనలు, కర్మాగారాలు.

కాస్తంత ఆకుపచ్చ నేల వుంది. అది సరవయ్యగారి పొలంట. దానిగుండా నూనెగొట్టాలు పెడతారుట. అక్కడ ఓ స్తంభం పాతాలంటే పన్నులుట, పత్రాలుట, ఒడంబడికలుట. నా స్వంత పొలం ఓ రెండు ఎకరాలు వుంది. ఆ ప్రాంతంలో స్తంభం పాతించండి అన్నాను. మా కరణంగారు సహకరిస్తారు, కనుక్కోండన్నాను. ఐన్‌స్టీన్ మళ్ళా నవ్వుతూ మొదలెట్టాడు.

"మీ భూగోళం కాలమాన ప్రకారం ఆ ప్రజ నలభై ఏళ్ళు ముందుకు సాగారు. ఏడెనిమిది పంచవర్ష ప్రణాళికలు అమలు జరుపు కొని భూమిని పంచించుకొని యంత్రాల ద్వారా ఉత్పత్తి అభివృద్ధి చేసు కొని సుఖంగా ఉన్నారు. మీ వూరి కరణం, మునసబులు చనిపోయి పదేళ్ళయింది."

ఏం చేయను.

నా గాజుమేడకి చోటే లేదా!

రెండు పనులు జరగాలి. నా గాజుమేడ భూమి దగ్గరగా వుండాలి. అందులోకి జనం ఎక్కివొచ్చే నిచ్చెనలాంటి పరికరం ఉండాలి. తుదకు "లింకన్" సలహాపైన రెండు స్తంభాలు లేవనెత్తించి వాటమీద ఎత్తుగా నిలబెట్టే ఏర్పాట్లు చేశాడు "బెంజమిన్ ఫ్రాంక్లిన్". అతనికి గాలి పటాల ఆటంటే యిష్టంట. నా మేడ ఓ గాజు గాలిపటంట,

ఇప్పుడు బాగుంది. భూమి కనబడుతుంది. స్వేచ్ఛగా, హాయిగా, ఏకాంతంగా ఉన్నాను. ఇంక వినోదించవచ్చు. "నెఫెర్‌టిటె", "కాథిరిన్", "ఆస్‌బోలిన్", "మేరీ పిక్‌ఫోర్డు", "మైత్రేయి", మల్లమ్మ, మాంచాల—వీరందర్నీ రమ్మన్నాను. తాన్‌సేన్, సైగల్ గానం సాగించారు. రంగాజమ్మ నృత్యం సాగింది. పిరుదులతో లయకలుపుతూ ఆమె భుజాలు ఎగురుతున్నాయి. విన్యాసానికి నడుం కాసేపు సన్నబడి, కాసేపు పెద్దదై కళ్ళల్లో కామం కదిపిన కాంతులు నల్లగా, తెల్లగా దాగిలిమూతలాడుతూ భక్తితో కందినచెక్కిళ్ళు, శృంగారంతో ఎర్రగా అదిరిన పెదవులను చూసి సిగ్గుపడి, నమ్రత, కవ్వింపు నుదిటిమీద ముంగురుల మధ్య యిరుక్కుని, జెడలో బంధించబడి, మెడలో దర్శనమిచ్చి, నరాల ఫిరాయింపులో రక్తం చిందిన చర్మం మెత్తటి వెలుగు ఆమె నవ్వులో కాంతికి తట్టుకోలేక నొప్పులో అంతర్థానమైన దృశ్యంతో చైతన్యం గోల్పోయి త్రాగుబోతునై, పశువునై, కేంద్రం గోల్పోయిన ఎలక్ట్రాన్‌లా పరిధిలేని సున్నాలా, కోణాలులేని త్రిభుజంలా.

* * *

ఏదో చప్పుడు—ఏవో ధ్వనులు. కిందికి చూశాను. క్రింద మనుష్యులు యిటుకేసిచూసి నవ్వుతున్నారు. కొంప మునిగింది. గాజుమేడలో పేచీయే యిది. ఏదో రహస్యంగా చేయడానికి వీలులేదు. కిందవారు చూస్తున్నారు. వాళ్ళకి వెటకారమా. ఆ గొడవ ఆపు చేయమని నానా ఫర్నవీస్‌ని పంపించాను. నే కూడా వెళ్ళి కనుక్కుంటా నన్నాడు నెపోలియన్.

తిరిగొచ్చి చెప్పారు. క్రిందవాళ్ళు నాకేసి చూడ్డం లేదనీ, వారివారి పనుల్లో నిమగ్నులైనారనీ, పైకి చూశారంటే, ఏ గ్రహణమో వుందను కొని చూసివుంటారనీ, నేను కంగారుపడనక్కరలేదనీ హామీ యిచ్చారు. అయినా నాకు భయంగానే వుంది.

"అనును. నీ జీవితం అంతా భయాలపుట్ట. ఈ నగ్నసత్యాలు,

యీ వినోదాలు ఏమిటో తెలుసా ? నిన్ను కనగానే నీ అమ్మకి జబ్బు చేసింది సువ్వామెపాలు తాగలేదు. మరో దాదిని పెట్టి పాలిప్పించారు. ఆమె ప్రేమించిన వ్యక్తి ఆమెని మోసగించి వెళ్ళిపోయాడు. ఆ భగ్న హృదయంతో నీకు స్తన్యం యిచ్చింది. ఆ భయాలు, అనుమానాలు, భగ్నవాంఛలు నిన్ను పట్టుకుని పీడిస్తున్నాయి. నిన్ను గురించిన యధార్ధము తెలుసుకుని యిప్పుడే యీ ఏకాంత కామకలాపాలు విరమించు" అన్నాడు ఫ్రాయిడ్.

"నీ చేత యిల్లాంటి సిద్ధాంతాలు చెప్పించేటందుకు, బాల్యంలో నీ అనుభవము ఏమిటో జ్ఞప్తికి తెచ్చుకుని, ముందు నీ ఆంతరంగికాన్ని నువ్వు సరిచేసుకో" అని మందలించాను.

దీన్ని హర్షించాడు ఏడ్లర్.

"ఇప్పుడింతకీ చేయవల్సింది ఒకటుంది. నాకు బైటవాళ్ళు కనబడాలి. కాని బైటవాళ్ళకి మాత్రం నేను కనబడకూడదు. అట్లాంటి గాజుని కనుక్కోలేరా విజ్ఞానశాస్త్రవేత్తలు" అన్నాను.

న్యూటన్" కనుక్కుంటా నన్నాడు. కాని దానికి కావాల్సిన పరికరాలు భూమిలో ఉన్నాయి. కొన్నివేల మంది పనివాండ్రు చాలా కాలం శ్రమపడాలి అన్నాడు. తెప్పించమన్నాను. అలెగ్జాండర్ తన సైన్యాన్ని రప్పించాడు. కుతుబ్‌మీనార్ కట్టిన కూలీలు సిద్ధమయ్యారు. ఆంగ్‌కోర్‌వాట్, మజ్‌దూర్ లొచ్చారు. పరికరాలు యిక్కడికి తెప్పిస్తే పనికి పూనుకుంటాంగాని, మేం భూలోకంలోకి మాత్రం వెళ్ళమని ఖచ్చితంగా చెప్పారు. మరెల్లా ?

భూమిమీద పనివాండ్రని వినియోగించండి అని వీరేశలింగం పంతులు గారి సలహా.

"వారికి వేతనాలివ్వాలి. పైగా చరిత్ర సమకూర్చిన ఆస్తిపాస్తులు అనుభవిస్తూ, ఏమీ పనిచేయకుండా, వినోదించే యీ చరిత్రస్వామితత్వం పెంపొందించేటందుకు రమ్మంటే ఆ పనివాండ్రురారు. వారంతా

ఏకమై ఒక వుద్యమంలేవదీసి, విప్లవం చేసి నీ గాజుమేడ కూలదోస్తారు" అన్నాడు కారల్‌మార్క్స్.

"వినోదం, తీరిక, కాలక్షేపం లేకుండే నాగరికతే లేదు; కళా సృష్టి లేదు; పోషణ లేదు. అటు చూడు, స్తంభాల క్రింద కార్లు, ట్రాములు, రైళ్ళు, యంత్రాలు, పొగ, తారు, కరిగిన ఇనుము, అతికిన ఉక్కు—ఈ కృషి అంతా ఎందుకు ? తిండి, బట్ట సరిపోతాయా ? నిత్య జీవితంలో సౌందర్యం అక్కర్లేదా ? ఆత్మవిశ్వాసం ఉండాలా ? సత్యాన్వేషణ, దైవచింతన అక్కర్లేదా ?" అని అడిగారు "విలియమ్ మారిస్", "సామ్యుయల్ బట్లర్."

"అవన్నీ ధనికులు బీదల్ని తృప్తిపరచడానికి కల్పించిన మాయ తత్వం. ఏ సృష్టి జరిగినా ఆకలి ద్వారానే" అన్నాడు ఏంజెల్స్.

కిందవాళ్ళకి కనబడకుండా బైట గోడలకి, నేలకి ఏదేనా లేపనం పుయ్యమన్నాడు, "పాస్కల్". అల్లాగే చేశారు.

అది వల్లకాదన్నాడు గాంధీగారు. పదిమందీ ఆక్షేపించే పని మనం ఏకాంతంగా చెయ్యకూడదన్నారాయన. భూలోకంలోవారినందర్నీ రప్పించి, వో గంటసేపు, చర్ఖాలు త్రిప్పి, దారాలు ధరించమన్నా రాయన. నే నేం చెయ్యను ? ఆయనంటే భయం నాకు. నెలరోజుల కోనాడు వుపవాసం ఉంటానని, ఆ రోజు ఆయన సిద్ధాంతాలను స్మరించి రాట్నం వాడుకుతాననీ వాగ్దానం చేశాను.

"నువ్వు పాటించలేని వాగ్దానం మాత్రం చెయ్యకేం" అని నవ్వు కుంటూ వెళ్ళాడు మహాత్ముడు.

మళ్ళా గానం, నాట్యం, కవిత్వపఠనం మొదలుపెట్టాను.

సారాబెర్‌నాట్ శకుంతల, హరిప్రసాదరావు దుష్యంతుడు—నాటకం. పుంగల చలపతి సక్కుబాయి, జీమ్స్ బాస్వెల్ ఆమె భర్త—మరో నాటకం.

ఖలీల్ జిబ్రాన్ ప్రేమగేయాలు; బాడిలేర్ బూతు పద్యాలు; ఈసప్ పిట్టకథలు, అనార్కలీ విషాద ప్రణయం. నేనును వాటిల్లో కలిసిపోయి, విడిపోయి, నన్ను వెదుక్కుంటున్నా. "ప్రేక్షకు లేరీ ?" అన్నాడు సోక్రటిస్.

"ఇప్పుడేమిటి నేను ఆనందిస్తుంటే" అన్నాను.

"పిచ్చివాడా—నువ్వు ఆనందించడంలేదు. నిద్రపొయ్యావు. నిద్రలో కల—అంతే; ఈ కళాకారు లెవరూ రసికులు లేనిదే వుపక్ర మించరు—లే, లే, కళ్ళు తుడుచుకో" అని కదిపాడు సోక్రటీస్.

అవును, ఎవ్వరూ లేరు. ఏదో కల. ఎక్కడినుంచో పెడవాసన, తారుకంపు-అబ్బ! పొగ-నుసి- కళ్ళల్లో పడుతుంది. ఏమిటిదంతా ?

ఇవన్నీ భూమినుంచి బైలుదేరిన వాసనలు, చప్పుళ్ళు, దృశ్యాలు, అన్నారు నలుగురైదుగురు. ఇవన్నీ ఆపుచెయ్యమని చెప్పేస్తానని "మహమ్మద్ గజనీ" వెళ్ళాడు.

వాళ్ళదేమీ ఆపరుట.

మేం అందరం వెళ్ళి చావచన్ని చక్కావొస్తాం – అన్నాడు గురజాడ.

"యుద్ధం తగదు—మన మేడ మరో చోట పెట్టుకుందాం" అని అశోకుడి బోడి సలహా.

పైగా మన మేడేమిటి ? ఇది నా మేడ. ఈ ముఠా అంతా రాత్రీ పగలూ ఇక్కడే వుంటారా ఏమిటి కొంపతీసి ?

అందర్నీ అవతలకి పొమ్మన్నాను. ఒక్కసారిగా శ్మశానాలు తెరుచుకున్నట్లుగా నవ్వులు ప్రతిధ్వనించాయి. ఒక్కసారిగా గాజుమేడ కదిలినట్లయింది.

ఒగుర్చుకుంటూ చక్కా ఒచ్చాడు, వాత్స్యాయనుడు.

"నా కామసూత్రాలు చదివి యీ మొగాళ్ళు ఆడాళ్ళు సంతోషంతో బలం తెచ్చుగున్నారు. నీ మేడ స్తంభాల్ని వూపేస్తున్నారు" అన్నాడు.

"ఏం, ఏమొచ్చింది ?"

"ఏమో. వాళ్ళేదో కట్టుగుంటారట. వినోదశాలట; యీ స్తంభాలు అడ్డంగా ఉన్నాయిట; తియ్యకపోతే ఊడపీకుతామంటున్నారు" అన్నాడు.

"అందరూ వెళ్ళి విషయమేమిటో కనుక్కోండి", అని గర్జిం

సమాధానం లేదు. ఎవ్వరూ మాట్లాడరు.

ఆఖరి కన్నాడు అరిస్టాటిల్. మీ మనుషులు చరిత్రలోకెళ్ళా ల్సిందేగాని, చరిత్రలో మనుషులు మీ దగ్గరికి రారు. వారి కంతటి నిజాయితీ."

ఏడిసినట్లే ఉంది.

"పోనీ మేడ మరో చోటుకి మార్పించండి" అన్నాను.

టపీమని ఒక రాయిలాంటిది అద్దం నేలమీద పేలింది. గాజు ముక్క ఊడింది. మరో రాయి; మరోటి. నేల ముక్కలవుతోంది. ఏమిటిదంతా ?

"కిందవాళ్ళు స్తంభాలని కదల్చలేక మేడమీదికి రాళ్ళు విసురు తున్నారు" అన్నాడు వీరేశలింగం.

"ఓర్చలేరండి" అని పైకనేశాను.

"నువ్వు వాళ్ళని చూసి ఓర్చగలిగావా ?"

ఏ డెవడు? షేక్స్పియర్. "ఏదీ మనసారా చెయ్యలేవు. నీకు స్నేహం కావాలి. మనుష్యులు పనికిరారు. ప్రేమ కావాలి, భార్య చాలదు; గట్టిగా, తీవ్రంగా, బలంగా, స్వేచ్ఛగా ఏ ఉద్రేకానికీ లొంగి పోవు; అన్నీ సగంసగం ఏడుపు; మూతి బిగించి ముద్దుకోరుతావా ? చేతులు వెనక్కి కట్టుకొని కౌగలింపా ? నీ కన్నీరు కాస్త కాస్త, కొంచెం కొంచెం కావాలి. దేనికోసం కృషిచెయ్యవు. ప్రతిదీ లభించాలి. చీమ కుట్టితే ఆపరేషన్; ప్రేయసి బుగ్గగిల్లితే తలవంపు—నీ గర్వం, నీ అహం,

నీ క్రౌర్యం, నీ కామం, నీ నీచత్వం, నీ అల్పత్వం—అన్నిటికి సాక్షి నీ గాజుమేడ. అది కూలి అందులో హతమవ్వడమే నా విషాదాంత నాటకాంతం—నీ జీవితాంతం..."

రాళ్ళు పడుతున్నాయి. పొగ దట్టంగా అలుముకొని, చీకటి చేస్తోంది.

"పోనీ నన్ను దించివెయ్యండి—మా మనుష్యుల్లోకి, భూమిమీదకి పోతాను" అని దీనంగా కోరాను.

ఎవరో నవ్వుతున్నారు. ఆ నవ్వు గుర్తుంది—ఐన్‌స్టీన్.

'నువ్వు భూమిమీదికి పోలేవు' అన్నాడు. కచ్చితంగా.

"ఎందుకు పోలేను ?

"నువ్వు నలభై ఏళ్ళ క్రితం గాజుమేడ పూర్తిచేశావు. భూలోకం కాలమానం ప్రకారం ఇప్పటికి మరో నలభై ఏళ్ళయింది. నీ ఆయుర్దాయము డెభ్భై ఏళ్ళు. అంటే ఏమన్న మాట!"

దిక్కు మొహం వేశాను.

"నీకు లెక్కలు రావు. నువ్వు చనిపోయి పదేళ్ళయింది, మీ కాలమానం ప్రకారం".

'అమ్మయ్యో బాబో' అంటూ శోకాలు మొదలెట్టాను.

'ఏడవకు. చచ్చినా, బ్రతికినా నీలో మార్పులేదు. ఏదో కృషిచేసి, ఏకాంతంగా ఆలోచన సాగించి, దీక్షతో మహాకార్యం సాధిస్తానన్నావు మొదట్లో. నువ్వు సాధించిందేమిటి? చచ్చింతర్వాత కూడా ఆ చేష్టలే. ఆ అవతారమే, ఆ తికమక ఆలోచనలే. కాబట్టి పాఠం నేర్చుకో బ్రతికుండగానే నువ్వు ఏదన్నా సాధించాలి, చచ్చింతర్వాత కాదు'.

"ఇంక నే నెక్కడ బ్రతికేది – ఇంతటితో సమాప్తే."

నీ లోకం లెక్కల ప్రకారం సమాప్తే. కాని మరోగోళంలో, మరో దృక్పథంతో, నువ్వు బ్రతికేవున్నావు. అదే మానవుడి చరిత్ర. దూరముగా ఆ గోళంకేసి చూడు. అందులోంచి చూస్తే నువ్వసలుపుట్టనేలేదు.

"మరి ఈ అనంత విశ్వంలో ..."

"విశ్వం అనంతంకాదు. దానికి పరిమితి వుంది. నువ్వనుకున్న మీ విశ్వంలో ప్రయాణం చేస్తే, మళ్ళా తిరిగి యిక్కడికే చేరుకుంటావు. శూన్యం గుండ్రంగా, వొంగిఉంది. బత్తాయి పండు మీద చీమ నిరంతరం తిరుగుతూ, విశ్వం అనంతం అనుకుంటుంది. అంతే నీ బ్రతుకు."

చచ్చినవాడికి—నాకీ మేడలో కాపరం ఏమిటి? ఏదీ ఒక రాయి యివ్వు, పగలకొడతాను. ఈ గాజు పెంకులన్నీ కూలి క్రింద మనుష్యుల మీదపడి చస్తారు. నాకసి తీరుతుంది.

"చచ్చిన వాడివి ఇప్పుడైనా దయలేదా ? మనుష్యుల్ని ప్రేమించ లేవా ? నీ గాజు మేడ నువ్వే పగలకొట్టుకో—కాని క్రింద మనుష్యుల మీదపడదు. మరో గోళం వైపు ఆకర్షింపబడే అణువులు గాజులో వెయ్యించానని చెప్పానుగా. ఈ ముక్కలన్నీ మరో గోళంలోకి పోతాయి."

"మరి నేను ?"

"ఇంకా 'నేను' అనే భావిస్తున్నావా ? ఇంక నువ్వు లేవు. ఆ గాజు పెంకుల మధ్య ధ్వంసమై పరిమితి గల విశ్వంలో, గుండ్రముగా తిరిగి తిరిగి యిక్కడికే చేరుకుంటావు."

మనుష్యులు వేసిన రాళ్ళలో ఒక రాయితీసి బురుజు మీద విసి రాను. అందులో 'రవివర్మ' కూర్చొని ఏవో చిత్రాలకి మెరుగులు పెడు తున్నాడు. అతనికి తగిలింది రాయి.

అతనికి కోపంవచ్చింది. ఆ సీసాలు, ఆ కుంచెలు తీసి బురుజు కేసి కొట్టాడు. ప్లాటో వాయిస్తున్న "హార్పు" తీగలపై అపశ్రుతులు మోగించి నా మొహాన కొట్టాడు.

"ఈ సగంచచ్చిన మానవుడు చరిత్రలో అమరులమైన మనల్ని కించపరిచాడు; దూషించాడు—పైగా రాళ్ళతో హింసిస్తున్నాడు. మనం అతనికోసం పడిన శ్రమంతా వృధా అయింది. కృతఘ్నుడు; ఊరుకుం

టారేం ! ఇతన్ని అనామకుడుగా చేసిపారెయ్యండి. తన్నండి, హింసించండి" అంటూ 'సిసిరో' 'శ్రీనివాసశాస్త్రి'లు తమ గంభీరోపన్యాసాలతో పురికొల్పుతున్నారు.

పిరమిడ్లు పూడటికి ఆ రాళ్ళతో నా గాజుమేడని పగలగొడుతున్నారు. హంపి, హారప్పా, మొహంజదారో, చైనా, హాడ్రియన్‌గోడలు— అన్నీ పూడలాగి నా మేడని కొడుతున్నారు. క్రింది నుంచి మనుషులు రాళ్ళతో నేలని పేలుస్తున్నారు. పైన, క్రింద, ఎడమ, కుడి అన్ని దిక్కుల నుండి రాళ్ళు, పెంకులు, బాణాలు, గొడ్డళ్ళు, పారలు, కంచు చెంబులు, ఇనుప బల్లాలు, విమాన విధ్వంసక తుపాకులు, ఆటంబాంబులు అన్నీ పేలిపోతున్నాయి.

పెద్ద చప్పుడైంది. చరిత్రలో స్త్రీలు ప్రియుళ్ళ తమ రొమ్ముల మీద హత్తుకున్నప్పుడు చేతుల గాజులు పగిలిన చప్పుడు; సముద్రగర్భములో కోటి ముత్యపు చిప్పలు విడి ముత్యాలు పగిలినట్లు, పగతో నియంతలు పళ్ళు పటపట కొరికినట్లు, ఓదలైన వృద్ధులు చలికి తట్టుకోలేక కొట్టుకుంటున్న పళ్ళను బిగించినట్లు, ప్రేమతో దైవం పిలుస్తుంటె వినిపించుకోక సమాధిలో కెళ్ళిన భక్తుల గుండెకాయలు పగిలిన చప్పుడు ... నా గాజుమేడ కూలింది.

జారిపడి ముక్కలైంది టీ కప్పు. పెండ్లికి స్నేహితుడచ్చిన కానుక టీ సెట్టు – సెట్టులో మిగిలిన వొక్క టీ కప్పు. మిగతావి వారూ వీరూ తీసుకుపొయ్యారు. ఇదొక్కటే మిగిలింది. ఇది కాస్తపగిలింది. ఆ సమయంలో ఆమె స్నానాని కెళ్ళడం నాకొక అదృష్టం. గబ గబా పగిలిన ముక్కలు ఏరి, ఎత్తి పారేస్తూ, ఆ కొద్ది విషాద మధురక్షణాలలోనే కన్న ఘగటి కల నా గాజు మేడ !